క్లుప్తంగా

జాతర ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన్న ఆలయ జాతర ఏర్పాట్లను శనివారం సిరిచెల్మ పంచాయతీ ప్రత్యేకాధికారి డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు నిర్వహించే జాతరలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనం చెల్లించాలి

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికులకు పెరిగిన వేతనం రూ.1000తో కలిపి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కొత్తగా ఎలాంటి కార్మికులను విధుల్లోకి తీసుకోవద్దన్నారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులు రిటైర్డ్ అయిన పక్షంలో వారి కుటుంబసభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: భవన, ఇతర నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతి శీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ గంగాధర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్మికుల పెండింగ్ క్లైయిమ్స్ పరిష్కరించాలని, పథకాలను మెరుగుపర్చాలన్నారు. ఇందులో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, వెంకట నారాయణ, గంటా నాగయ్య, గౌరాల సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

తాంసి: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం అరుణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు ప్రభాకర్, హర్షవర్ధన్ రెడ్డి, గంగయ్య, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే జిల్లా అభివృద్ధికి కృషి

ఎదులాపురం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పిస్తే జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకులు రాంకిషన్ నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లంబాడా సామాజిక వర్గానికి చెందిన తాను 35 ఏళ్ల పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమశాఖలో సేవలందించానని గుర్తు చేశారు. జిల్లా మేనేజర్‌గా ఎంతో మంది నిరుద్యోగ యువతకు రుణాలు అందించి వ్యాపారులుగా ఎదిగేందుకు కృషి చేశానన్నారు. పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన మోదీ ఎలాంటి వరాలు ఇవ్వకుండా ప్రజలను మోసగించారని ఆరోపించారు.

వడగళ్ల వానతో పంట నష్టం



నేలవాలిన జొన్న పంట

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్, కొలారి, చందునాయక్‌తండా, గిర్నూర్, దేగామ గ్రామాల్లో శనివారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. దీంతో జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. సుమారుగా 60 ఎకరాల్లో జొన్న పంట నేలకొరిగినట్లు రైతులు తెలిపారు. చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చినుకు పడితే వరదే

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం తెలికపాటి వర్షం కురిసింది. వర్షానికే రోడ్లని నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుంతల్లో నీరు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

వీధి వ్యాపారులకు అండగా..

- అర్హులైన వారికి పీఎం స్వనిధి రుణాలు
- సకాలంలో చెల్లిస్తే రెట్టింపు రుణం



వీధి వ్యాపారులు

కైలాస్‌నగర్: ఎండనక, వాననక పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రోడ్ల వెంట వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారాలకు అండగా నిలువాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ (పీఎం స్వనిధి)పథకాన్ని అమలు చేస్తోంది. మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో 8878 మంది చిరు వ్యాపారులను ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించింది. వారికి ఐడీ కార్డులతో పాటు స్ట్రీట్ వెండర్స్‌గా సర్టిఫికెట్లు సైతం అందజేసింది. ఇందులో అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తూ.. ఆర్థిక చేయూతనందిస్తోంది. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించే వ్యాపారులకు రెట్టింపు రుణాన్ని అందజేస్తున్నారు.

వీధి వ్యాపారులకు చేయూత..

కోవిడ్ మహమ్మారీతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్న చిరువ్యాపారులకు ఆర్థిక తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో 2020 మార్చిలో కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మెప్మా ద్వారా ఇలాంటి వారి గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేపట్టింది. ప్రతీ వ్యాపారికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించాలని సంకల్పించింది. ఇప్పటి వరకు మూడు విడతలలో రుణాలను అందజేశారు.

సకాలంలో చెల్లిస్తేనే రెట్టింపు రుణం..

ఈ పథకం కింద తీసుకున్న రుణాన్ని ఏడాదిలోపు ఏడు శాతం వడ్డీతో బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా సక్రమంగా చెల్లించిన వారికి మలివిడతకు అర్హులుగా గుర్తించి రెట్టింపు రుణం అందజేస్తున్నారు. తొలి విడతలో రూ.10వేలు, మలి విడతలో రూ.20వేలు రుణాలివ్వగా, మూడో విడతలో రూ.50వేలను అందించే ప్రక్రియ సాగుతోంది. తొలి విడతలో 6620 మందికి రుణాలను అందజేయగా, మలివిడతలో 2601 మందికి రూ.20వేల చొప్పున రుణాలను అందజేశారు. ఇలా మొదటి, రెండో విడతలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన వారికి మూడో విడత కింద రూ.50వేల చొప్పున రుణమందిస్తున్నారు. ఈ విడతలో 663 మంది దరఖాస్తు చేసుకోగా 564 మందికి రుణాలను మంజూరు చేశారు. ఇందులో 552 మందికి రుణాలను అందజేశారు. మిగతా వారికి రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మనిర్భర్ భారత్ పథకం వీధి వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అర్హులైన ప్రతిఒక్కరికీ ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా రుణలందించేలా శ్రద్ధ వహిస్తున్నాం. వ్యాపారులు బ్యాంకు రుణాల కోసం మెప్మా సిబ్బందిని సంప్రదించాలి. వారు తీసుకున్న రుణాలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తే మలిడతలో రెట్టింపు రుణం పొందవచ్చు.

– శ్రీనివాస్, మెప్మా డీఎంసీ

కవిత అరెస్ట్‌పై బీఆర్‌ఎస్ నిరసన



నార్నూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నార్నూర్: ఎమ్మెల్సీ కవితను అరెస్ట్‌కు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో నల్లాబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు మాట్లాడుతూ.. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొలేక బీజేపీ, కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. నాయకులు తొడసం నాగోరావు, ఫెరోజ్‌ఖాన్, సయ్యద్‌ఖాశీం, రాథోడ్ శివాజీ పాల్గొన్నారు.

బోథ్: కవితను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సొనాలలో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం బంద్ నిర్వహించారు. ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుకాణాలను బంద్ చేయించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అప్రజాస్వామికంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, రాజు, సుభాష్, ప్రవీణ్, రఫీ, రమణ, ఇఫ్తాకర్, నారాయణ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శనివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఎంపీపీ జైవంత్‌రావు, మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్‌లు మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, శ్యాం, భరత్, రమేశ్ పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: రాజీతోనే కేసులు పరిష్కారం అవుతాయని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మాట్లాడుతూ.. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. లక్ అదాలత్‌లో 189 కేసులు పరిష్కరించినట్లు జడ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

223 కేసుల పరిష్కారం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్‌కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 223 కేసులు పరిష్కారం అయ్యాయి. బ్యాంకు అదాలత్ ద్వారా రూ. 2,55,882 రికవరీ అయినట్లు జడ్జి హుస్సేన్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో పీపీ శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్, కార్యదర్శి శంకర్, న్యాయవాదులు మోహన్‌రావ్, అంగద్ కేంద్రే, ధమ్మపాల్, రూపేందర్ సింగ్, కుమ్మరి విజయ్, జమీర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటుకు ప్రణాళికాలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో జవహర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీ ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో పర్యవేక్షతో పాటు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు ఉపయోగపడతాయన్నారు. ఐకేపీ అధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలతో కమిటీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం రమేశ్, సీసీలు సంతోష్, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న వైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్

తలమడుగు: పశుపోషకులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఎంపీడీవో చంద్రశేఖర్, పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులకు వేసవిలో గడ్డి విత్తనాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, శివ శరణ్, మోహన్‌దాస్, గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఈనెల 18 నుంచి నిర్వహించే పది పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలో ఆశ్రమ బాలిక వసతి గృహం, జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు కేస్లాపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో పది పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 215 మంది, జిల్లా పరిషత్ పాఠశాల పరీక్ష కేంద్రంలో 257 మంది, కేస్లాపూర్ పరీక్ష కేంద్రంలో 217 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఎంఈవో నారాయణ తెలిపారు.

'గజేందర్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి'

బోథ్: ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ టికెట్‌ను బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌కు కేటాయించాలని బోథ్ ఎంపీటీసీ రజియా బేగం నాసర్ అహ్మద్ శనివారం కోరారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గజేందర్‌కు అనుచరవర్గం ఉందన్నారు. గజేందర్‌కు టికెట్ ఇస్తే గెలిపించుకుంటామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో తపాల కార్యాలయం వద్ద శనివారం ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాల కార్యాలయానికి వచ్చే వృద్ధుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కమలజలైజాకు, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, గట్టు మహేందర్, మామిడి విజయ్ పాల్గొన్నారు.

రక్తదానం

ఎదులాపురం: బేల మండల భవానిగూడ గ్రామానికి చెందిన ఆత్రం పండు రక్తహీనతతో రిమ్స్‌లో చేరాడు. పరీక్షించిన వైద్యులు 3.7 రక్తం ఉందని వెంటనే రక్తం ఎక్కించాలని సూచించారు. ఈ విషయాన్ని అదే మండలానికి చెందిన యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామరూపేశ్‌రెడ్డికి ఫోన్ చేసి తెలిపారు. ఆయనది సేమ్ బ్లడ్ గ్రూప్ కావడంతో సామరూపేశ్ రెడ్డి రక్తదానం చేశారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీకాంత్ తండ్రి మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అంకోలిలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ గంద్రత్ రమేశ్, నాయకులు కుమ్రరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన గోడం నగేశ్

కైలాస్‌నగర్: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో కలిసిన శాలువాతో సత్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పార్లమెంట్ కో కన్వీనర్ అశోక్ ముస్తాపురే, జెడ్పీటీసీ రాజు, రాంచందర్, దేవిదాస్, సుభాష్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

జైనథ్: మండలంలోని మేడిగుడ గ్రామంలో బాజీరావ్ బాబా సప్త వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా కొనసాగుతున్న సప్తహం శనివారంతో ముగిశాయి. చివరి రోజు బాబా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. బాజీరావ్ బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్కం రాందాస్, అస్తక్ సుభాష్, బింగి వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పుష్పలత

ఇంద్రవెల్లి: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యుడితో మాట్లాడి రోజువారి ఓపీ, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, కార్యకర్తలు రాథోడ్ భీంరావ్, పెందోర్ గణేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రబుద్ధ నగర్‌లో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి మరుగుదొడ్డి నిర్మాణాలు, జిల్లా పరిషత్ పాఠశాలలోని సైన్స్ గది నిర్మాణ పనులను ప్రారంభించారు. మామిడిగూడ గ్రామానికి సంబంధించి బీటీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పంచాయతీరాజ్ శాఖ డీఈ రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ జహీర్, సోమోరే నాగోరావ్, జితేందర్‌ర పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం మండలంలోని దొంగచింత గ్రామంలో నీటి సమస్యల పరిష్కారానికి బోర్‌వెల్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. నీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భగీరథ ఏఈ సురేందర్, గ్రామ పటేల్ జుగాదిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యం'



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నియోజకర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం మావల మండల కేంద్రంలోని నిర్వహించిన చేరికల కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి హాజరయ్యారు. మావల తాజా మాజీ సర్పంచ్ దొగ్గలి ప్రమీలా రాజేశ్వర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చినా హామీ మేరకు వంద రోజుల్లో పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, గిమ్మ సంతోష్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు పని చేయాలి

కైలాస్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రజాసేవభవన్‌లో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు ధరి చేరాయన్నారు. ఆరు గ్యారంటీల హామీలను నిలబెట్టుకున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో రాంనగర్ మాజీ ఎంపీటీసీ సాంబాజీ, ఖయ్యూం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని రోల్‌మామడ గ్రామంలో శనివారం నిర్వహించిన ఆంజనేయస్వామి ఆలయ కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ నిత్యం ఆలయాల్లో పూజలు చేయడంతో పల్లెల్లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. పూజారి ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించే చెక్‌డ్యాం నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం భూమిపూజ చేశారు. చెక్‌డ్యాం నిర్మాణంతో రైతులకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, నీటిపారుదల శాఖ డీఈ భీంరావ్, నాయకులు శ్రీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే పరీక్షల్లో విజయం



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ నరేశ్

నేరడిగొండ: పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థుల ప్రవర్తనలో మార్పు, ఆందోళన మొదలవుతుందని నేరడిగొండ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రాంనరేశ్ అన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో ఒత్తిడిని ఎలా తట్టుకోవాలనే దానిపై శనివారం బుగ్గారం(బి) గ్రామంలో గల టీటీడబ్ల్యూఆర్‌జేసీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పరీక్షలపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని మండల వైద్యాధికారి సర్ఫారాజ్ అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. ఆయన వెంట అంకోలి పీహెచ్ పర్యవేక్షకుడు ఆరోగ్య పర్యవేక్షుడు బొమ్మెత సుభాష్, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేమ్‌సింగ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- పూర్తిస్థాయిలో హాజరు కాని అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ కల్యాణం లక్ష్మి

తలమడుగు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శనివారం తూతూమంత్రంగా సాగింది. మండల పరిషత్ అధ్యక్షురాలు కల్యాణం లక్ష్మి రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేకాధికారులు ఉండడంతో వారు ఏం మాట్లాడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తారని ఆశగా ఎదురుచూసిన మండలవాసులకు నిరాశ ఎదురైంది. అనంతరం జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. మండల స్థాయిలో సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఉపాధ్యక్షురాలు దివ్య, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, పశు వైద్యాధికారి ధూద్‌రాం రాథోడ్, విద్యుత్ శాఖ ఏఈ సతీష్, మజార్, ఐకేపీ ఏపీఎం స్వామి, తదితరులు పాల్గొన్నారు.